"చూశారా మరి...కారుకు కూడా మీరు వెళ్ళడం అంటే ఇష్టంలేదు."

"తలుపు తీయండి!" ఆస్వరంతో సరస్వతి "సముద్రంలో దూకండి" అన్నా శ్రీనివాసరావు ఆలోచించే వాడు గాడు.

శ్రీనివాసరావు దిగివచ్చి బయటనుండి తలుపుతీశాడు. సర స్వతి దిగింది. అతడు కారుతలుపు నానుకుని నిల్చున్నాడు.

"వస్తాను. థాంక్స్!"

"ఫరవాలేదు కాని...మళ్లీ మిమ్మల్ని చూడ్డం ఎప్పుడో?" సరస్వతి పక్కకు తిరిగి చూసింది.

"పలకరేం? మనం కలుసుకోవడం మీ కిష్టంలేదా?"

"అదికాదు"

"మరేవింటి, చెప్పండి!"

"మీరు నా మీద బహువచనం ప్రయోగించడం మాను కోవాలి."

"ఓస్, అదా!"

"వస్తానండి" అని వెళ్ళిపోయింది సరస్వతి. ఆమెభుజాన్ని ముట్టుకోబోయాడు శ్రీనివాసరావు. తటాలున వెనక్కు తిరిగిందామె.

"మళ్ళీ ఎప్పుడు కనబడతారో చెప్పకుండానేవెళ్లిపోతున్నారు?"

"మళ్లీ వర్షం వచ్చినప్పుడు!" అని నవ్వి లేడిలా నడిచి పోయింది సరస్వతి. ఆమె వీధిమలుపు తిరిగిన తర్వాత కూడా ఆ వైపే చూస్తూ నిల్చున్నాడు శ్రీనివాసరావు.

* * *

ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షలు మొదలయాయి.

అఫీసుకు సెలవుపెట్టి మొదటి రోజున లక్ష్మిని పరీక్ష హాలుకు తీసుకెళ్ళి కూచోబెట్టింది సరస్వతి. సాయంకాలంవెళ్ళి పిలుచు కొచ్చింది. ఆ పదిరోజులూ అక్కా చెల్లెలూ పుస్తకాలతో కుస్తీ పట్టారు.

పరీక్షలన్నీ అయిపోయాయి.

"అమ్మయ్య" అని నిట్టూర్చింది—సరస్వతి!

